క్లుప్తంగా

వెండి పళ్లెం విరాళం



బాన్సువాడ: పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయానికి మంగళవారం కామారెడ్డికి చెందిన బలరామన్, మనోరమలు 48 తులాల వెండి పళ్లెంను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కోటదుర్గమ్మ ఆలయానికి దాతలు పెద్ద మనస్సుతో 48 తులాల వెండి పళ్లెం, కుంకుమ భరణిని విరాళంగా అందించడం అభినందనీయమని, వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలన్నారు.

కూలిన పురాతన ఇల్లు



రాజంపేట: వర్షానికి తలమడ్లలో గ్రామానికి చెందిన మంచెనపల్లి భార్గవి పురాతన ఇల్లు పాక్షికంగా కూలింది. ప్రభుత్వం స్పందించి తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని భార్గవి కోరారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు మావని, నేతలు స్పందించి పరిహారం ఇప్పించాలని ఆమె కోరారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సత్కారం



కామారెడ్డి రూరల్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ద్వితీయ స్థానం పొందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవునిపల్లి విద్యార్థినిలు బి.మేఘన, మీనాక్షిలను అదనపు కలెక్టర్ చందర్ నాయక్ క్యాష్ అవార్డ్, సర్టిఫికెట్‌తో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా బిల్డింగ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మంగళవారం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆత్మనిర్భర్ భారత్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు సాత్విక 9వ తరగతి, నాని 10వ తరగతి, సీహెచ్ సాయి చరణ్ 10వ తరగతి, మహి 8వ తరగతి, ధార్మిక 8వ తరగతి, ఉదయ్ 7వ తరగతి విద్యార్థులు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగా కిషన్, టాటా బిల్డింగ్ ఇండియా ప్రతినిధి స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పీపుల్ ఫర్ ఇండియా సహకారంతో మంగళవారం దివ్యాంగ పిల్లలకు వీల్‌చైర్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. దేవునిపల్లి ఎస్సై రంజిత్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, రోటరీ కామారెడ్డి అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుతో వెంచర్‌లో షెడ్డు తొలగింపు



భిక్కనూరు: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు భిక్కనూరు మండల కేంద్రంలోని ఒక వెంచర్‌లో అధికారులు రేకుల షెడ్డును మంగళవారం తొలగించారు. ఆర్టీఐ జిల్లా ప్రతినిధి గంగ్లు రవీందర్ ఈనెల 8న భిక్కనూరు మండల కేంద్రంలో సిద్ధరామేశ్వరాలయానికి వెళ్లే దారి సమీపంలో ఉన్న వెంచర్‌లో గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా రేకుల షెడ్డు వేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్‌లు విచారణ చేపట్టారు. నిబంధలనకు విరుద్ధంగా రేకుల షెడ్డును నిర్మించారని తేలడంతో ఆ షెడ్డును తొలగింపజేశారు.

అన్నదాతకు కలసిరాని కాలం

ఇటు యూరియా కొరత.. అటు తెగుళ్ల బెడద

- పొట్ట దశలో దెబ్బతింటున్న వరి పంట
- ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- యూరియా వేయకపోతే దిగుబడి తక్కువ వస్తుందని రైతుల్లో ఆందోళన



వరిలో తెగుళ్ల నివారణ కోసం మందులు పిచికారీ చేయిస్తున్న రైతులు

బీబీపేట: ఈ వర్షాకాలం సీజన్ వరి సాగులో రైతన్న దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. వరి పొట్ట దశలోనే మొగి పురుగు ఆశించి కుంగదీస్తోంది. ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా పని చేయడం లేదని రైతులు వాపోతున్నారు. నాటు దశలోనే సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అంత ఉధృతి ఉండదని వ్యవసాయాధికారులు ఒకపక్క చెబుతున్నప్పటికీ పురుగులు సోకి పంటలు నాశనమవుతున్నాయి. ఈ సీజన్ భారీ వర్షాలతో వరి పంట అన్నదాతకు నష్టాలనే మిగిలేలా చేస్తోంది.

తెగుళ్లతో రైతులు దిగాలు..

జిల్లాలో ప్రస్తుతం వరి సాగు పొట్ట దశలో ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల తెగుళ్లు, పురుగుల ఉధృతి బాగా పెరిగిపోయిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరిలో ముఖ్యంగా కాండం కుళ్లు తెగులు సోకి వరి మొదటి భాగంలో కాండం నల్లగా మారి ఆకు మొత్తం ఎండిపోయినట్లు అవుతుంది. నివారణ కోసం ఆజాక్సిస్ట్రోబిన్, టెబుకోనజల్ మందును ఎకరానికి 250 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలి. అంతే కాకుండా కంకిలో నల్లి ఉధృతి ఉండడం వల్ల గింజలపైన నల్లటి మచ్చలు ఏర్పడి గింజ పాలు పోసుకునే దశలో పంట నాశనం అవుతుంది. దీని నివారణకు స్పైరోమెసిన్ మందును 200 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలి. అలాగే అగ్గి తెగులు నివారించని పొలాల్లో మెడకాటు కూడా వస్తుంది. వరి గెల కింద మెడ భాగంలో నల్లటి కాటు ఏర్పడి మెడ వంగిపోయినట్లు అయి కంకి కింద పడిపోతుంది. దీని నివారణకు పికాక్సిస్ట్రోబిన్, ట్రైసకోజోల్ మందును ఎకరానికి 400 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలి.

ఖర్చులు తడిసి మోపెడు..

వరినాట్లు వేయడం ఒక ఎత్తయితే ఇప్పుడు ఆ పంటలను పురుగుల బారి నుంచి కాపాడుకోవడం మరో ఎత్తు అవుతుంది. ఒక ఎకరం పొలం నాటు వేస్తే దానికి సుమారు 3 నుంచి 5 సార్లు పిచికారీ చేయాల్సి వస్తుంది. ఒక లీటరు మందు డబ్బాను కొంటే రూ.1,200 వరకు అవుతుంది. అలా మూడు సార్లు తీసుకుంటే రూ.4,600 అవుతుంది. అంతే కాకుండా పిచికారి చేసే పంపుడబ్బా కిరాయి రూ.200 ఉంటుంది. కూలీ డబ్బులు రూ.800 అవుతుంది. ఇలా మూడు సార్లు పంటను కాపాడుకోవడానికి చేసే చర్యలకు సుమారు రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతో రైతులు ఖర్చులు పట్ల ఆవేదన చెందుతున్నారు.

యూరియా కొరతతో ఇబ్బందులు..

వరి నాట్లు వేసిన రోజు నుంచి జిల్లా అంతటా యూరియా దొరక్క ఇబ్బందులు మొదలయ్యాయి.



యూరియా కోసం లైన్లో ఉన్న అన్నదాతలు(ఫైల్)

వరికి తగిన సమయంలో యూరియా అందకపోతే దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఒక ఎకరానికి సుమారు రెండు బస్తాల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు రైతులకు అందిన పరిస్థితి లేదు. దీంతో వరిలో ఎదుగుదల లేకపోవడంతో రైతులను మరింత కుంగదీస్తోంది. ఒక పక్క పొలం రోగాల బారిన పడడం, మరోపక్క ఎరువుల కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఎదుగుదల తగ్గింది



వరికి కావాల్సిన సమయంలో యూరియా దొరక్క పోవడం వల్ల వరికి ఎదుగుదల తగ్గింది. దీంతో రోగాల బారిన పడడమే కాకుండా కంకి కూడా తక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే పలుమార్లు పిచికారీ చేసినా తెగుళ్లు నయం కావడం లేదు. ఈ ఏడాది ఆశించినంతగా పంట దిగుబడి వచ్చేలా లేదు.

– ప్రభాకర్, రైతు, మల్కాపూర్

ఎప్పటికప్పుడు పరిశీలించాలి



రైతులు నాటు వేసిన నాటి నుంచి పొలాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అప్పుడే పురుగు సోకిన విషయాన్ని గుర్తించవచ్చు. అంతే కాకుండా ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల కూడా పురుగులు సోకి పంటలను నాశనం చేస్తున్నాయి. అలాంటి సమయంలో వ్యవసాయాధికారులు ఇచ్చిన సలహాలపైనే మందులను వాడాలి.

– రాఘవేంద్ర, ఏఈవో, బీబీపేట

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

- మోషంపూర్ గ్రామ మహిళల వేడుకోలు
- కామారెడ్డి ఆర్టీసీ డిపో ఎదుట నిరసన

కామారెడ్డి టౌన్: రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని డిమాండ్ చేస్తూ గ్రామ మహిళలు పెద్ద ఎత్తున కామారెడ్డి ఆర్టీసీ డిపోకు మంగళవారం తరలి వచ్చారు. డిపో ముందు ఆందోళన చేపట్టారు. డిపో మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ.. తమ గ్రామానికి గతంలో ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పుల బస్సు సౌకర్యం ఉండేదని, ఇప్పుడు బస్సు రావడం లేదని తెలిపారు. ప్రైవేట్ వాహనాలు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయిని వివరించారు.



ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కచ్చితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని అసిస్టెంట్ మేనేజర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూపల్లి ఉమాదేవి, రాజమణి, తోకల రాధ, మెరుగు సులోచన, లక్ష్మి, మొరికల భూమవ్వ, రేణుక, భారతి, మల్లవ్వ, సంతోష్ రెడ్డి, నవీన్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?



నస్రుల్లాబాద్: మండలంలోని తిమ్మాపూర్ వెళ్లే దారి పక్కన ఓ రైతు పంట పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడటంతో ఆయన కర్రను కరెంటు స్థంభంలా వాడారు. ఇటీవల వర్షాలు భారీగా కురుస్తున్నాయి. కర్ర తడిసి విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంది. మూగ జీవాలు కర్రకు తగిలినా విద్యుత్తు షాక్‌కు గురవుతాయి. ప్రమాదవశాత్తు కర్రకు ఎవరైనా తగిలినా మరణించే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కర్రను తొలగించి స్థంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరద నీరు పంట పొలాలకు మళ్లింపు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) గ్రామ శివారులోని మల్లారం చెరువు కట్ట తెగిపోయి నీరంతా వృథాగా పోయింది. చెరువులో నీరు లేకపోవడంతో వర్షం నీరు నిల్వ ఉండడానికి తాత్కాలికంగా ఫీడర్ చానల్‌ను తూము వరకు తవ్విస్తున్నారు. తూము నుంచి పంట పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. ఈ సీజన్‌లో రైతుల పంటలను కాపాడడానికి చెరువులో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఫసల్ బీమాను అమలు చేస్తే ఎంతో మేలు

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి

భిక్కనూరు: అతివృష్టి, అనావృష్టి సమయాల్లో రైతులు నష్టపోకుండా పంటల బీమా చెల్లించే విధంగా ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన అన్ని గ్రామాల బీకేఎస్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఫసల్ బీమా పథకం అమలు విషయంలో రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాలు ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు.



భిక్కనూరులో సమావేశమైన బీకేఎస్ నేతలు

ఇటీవల కురిసన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారంతో పాటు రబీకి అవసరమైన ఎరువులు పురుగుమందులు విత్తనాలను ఉచితంగా ఇవ్వాలన్నారు. మండలాధ్యక్షుడు నాగార్తి మల్లేష్‌రెడ్డి, నేతలు తాటిపల్లి సిద్దరాములు, గంగారెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



శేర్‌శంకర్ తండాలో నిల్వ నీరును తొలగిస్తున్న అధికారులు



కోనాపూర్‌లో నీటితొట్టెను ఖాళీ చేయిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

రాజంపేట: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. శేర్‌శంకర్ తండాను మంగళవారం ఆయన సందర్శించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఏఎన్‌ఎంలతో కలిసి ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

నిలువ నీటిని తొలగించాలి

ఎల్లారెడ్డిరూరల్: ఇంటి పరిసరాలలో నిలువ నీరు ఉండకుండా చూసుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం సోమార్‌పేట్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు, ట్యాంకులలో ఎక్కువ కాలం నీరు ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు.

కోనాపూర్‌లో..

బాన్సువాడ రూరల్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోనాపూర్ పంచాయతీ కార్యదర్శి భరత్ అన్నారు. మంగళవారం ఆయన ఆరోగ్య కార్యకర్త, ఆశావర్కర్లతో కలిసి పలు కాలనీల్లో పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కుండీల్లో నిల్వనీటిని ప్రతివారం పారబోసి కొత్త నీటిని నింపుకోవాలన్నారు. పరిసరాల్లోని మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.



సోమార్‌పేట్‌లో నిల్వ నీటిని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

ఓజోన్ పొరను సంరక్షించుకోవాలి

బాన్సువాడ రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తూ ఓజోన్ పొర పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.గంగాధర్ అన్నారు. మంగళవారం కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఓజోన్ పొర ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పారిశ్రామిక ఉద్గారాలను తగ్గించాలన్నారు. రసాయన శాస్త్రం విభాగాధిపతి చిరంజీవి, మోహన్‌రావు, భగవాన్‌రెడ్డి, వినయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి

కామారెడ్డి అర్బన్: భవిష్యత్తు తరాలు జీవించడానికి పంచభూతాలైన భూమి, నీరు, వాయువు, ఆకాశం, అగ్నిలను కలుషితం చేయకుండా రక్షించడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాల బోటనీ, ఫారెస్ట్రీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... భూమిపై ప్రమాదకరమైన అతినీలాలోహిత కిరాణాలు పడకుండా ఓజోన్ పొర కాపాడుతుందని, దానికి చిల్లుపడకుండా కాపాడాలన్నారు. ప్రజలను చైతన్యం చేయాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, అధ్యాపకులు టి.దినకర్, స్వాతి, జె.శ్రీలత, వెన్నెల, రమణ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గంగాధర్

ఐకేపీ రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

- అదనపు కలెక్టర్ చందర్‌నాయక్



దోమకొండ: మహిళలు ఐకేపీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల సమాఖ్య క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఆర్థిక లావాదేవీలు పక్కాగా ఉండాలని సూచించారు. దోమకొండలోని మహిళా క్యాంటీన్ ఇతర మండలాల వారికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మనోహర్, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులున్నారు.

వార్షికోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి



కామారెడ్డి టౌన్: తెలంగాణ సాయుధ వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఫణిహారం రంగాచారి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు వీఎల్ నర్సింహారెడ్డి, కంజర భూమన్న, జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, సహాయ కార్యదర్శి పి.బాలరాజు, నాయకులు రాజమణి, దేవయ్య, ఈశ్వర్, బాల్‌రాజు, సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ జెండా వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో కొలువు దీరిన తిరుమల తిరుపతి బాలాజీ జెండా వద్ద మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బాలాజీ జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంవత్సరం బుధవారం, గురువారం రెండు రోజుల పాటు మండల కేంద్రంలో బాలాజీ జెండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జెండా కమిటీ సభ్యులు కోరారు.



కృష్ణాజీవాడిలో భజనలు చేస్తున్న భక్తులు

కృష్ణాజీవాడి రాజరాజేశ్వరాలయంలో భజనలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడి గ్రామంలో గల రాజరాజేశ్వరాలయంలో సోమవారం రాత్రి భక్తులు ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయం ప్రాంగణంలోని గుండంలో పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం శివలింగానికి పాలాభిషేకం, జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. భగవన్నామ సంకీర్తనలతో భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. భజన మంగళవారం ఉదయం వరకు కొనసాగింది.

సమాచారం..

నేడు రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా జీవనజ్యోతి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి కామారెడ్డి బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రక్కన గల కేబీసీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, రక్త దాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాతలకు హెల్మెట్ బహుమతిగా అందజేస్తామని వారు పేర్కొన్నారు. దాతలు 9492874006, 8897349872 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్: ప్రధాని మోదీ జన్మదినోత్సవంతో పాటు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరం కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి రానున్నట్లు వారు తెలిపారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో రాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎంపిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారువారి పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకుని రావాలని ఆయన కోరారు.

స్వస్థ్ నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్

నస్రుల్లాబాద్/మద్నూర్: బీర్కూర్, డోంగ్లీ పీహెచ్‌సీలలో స్వస్థ్ నారీ-స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి అక్టోబర్ 2 వరకు మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ గిరీష్‌తో పాటు డోంగ్లీ ఆస్పత్రి సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సబ్ సెంటర్‌లో మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైతే చికిత్స కోసం బాన్సువాడ, నిజామాబాద్ ఆస్పత్రులకు పంపిస్తామన్నారు. మహిళలు ఉపయోగించుకోవాలన్నారు.

సంక్షిప్తం

ఎమ్మెల్యే, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని విఠల్‌వాడి నుంచి లింగంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న వంతెన ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కూలిపోయింది. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషితో రూ. 50 లక్షలు మంజూరు కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం సముందర్ తండా ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు.



ప్రతి మహిళకు పరీక్షలు నిర్వహించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలు, తండాల్లో ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాంబాయి సూచించారు. మంగళవారం లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 17న స్త్రీ వైద్య నిపుణులు రమాదేవి మండలానికి వస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్‌లో మంగళవారం పారిశుద్ధ్య పనులను ఎంపీవో మలహరి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జ్వరం సర్వే చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులకు సూచించారు.